రేపటితో ముగియనున్న డిగ్రీ ప్రవేశాలు

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 31: డిగ్రీ కళాశాలలో ప్రవేశం పొందడానికి ఆగస్టు 2తో గడువు ముగియనున్నదని స్థానిక తారా ప్రభుత్వ, జిల్లా ఐడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ బుధవారం ప్రకటనలో తెలిపారు. దోస్త్ స్పెషల్ ఫేజ్ రిజిస్ట్రేషన్లను ఆగస్టు 2లోగా చేసుకోవచ్చన్నారు. ఆగస్టు 3 వరకు వెబ్ ఆప్షన్లను పెట్టుకోవాలన్నారు. స్పెషల్ ఫేజ్ వెరిఫికేషన్ ఆఫ్ స్పెషల్ కేటగిరీ సర్టిఫికెట్స్ ఆగస్టు 2న ఉంటుందని, ఆగస్టు 6న స్పెషల్ ఫేజ్ సీట్ అలాట్‌మెంట్ ఉంటుందని, ఆగస్టు 7 నుంచి 9 వరకు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్, అదే తేదీల్లో కళాశాలలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని వివరించారు. విద్యతో పాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ తదితర అన్ని సౌకర్యాలు ఉన్న తారా ప్రభుత్వ కళాశాలకు మొదటి ప్రాధాన్యత వెబ్ ఆప్షన్ పెట్టుకోవాలని ఆయన కోరారు.

'గీతం'లో ప్రవేశాలు

పటాన్‌చెరు, జూలై 31: గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, ఎంబీఏ హెల్త్‌కేర్ అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ పేరిట ఇటీవల ప్రారంభించిన కొత్త కోర్సులో ప్రవేశాలు కొనసాగుతున్నట్టు కోర్సు సమన్వయకర్త డాక్టర్ ఐబీ రాజు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ జోన్(ఎంఎంటీజెడ్) అకాడమీ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ (ఏహెచ్ఏ)ల సంయుక్త సహకారంతో దీనిని ప్రారంభించామని పేర్కొన్నారు. ఆరోగ్య పరిరక్షణకు భవిష్యత్ తరం నాయకులను రూపొందించే లక్ష్యంతో ఈ రెండేళ్ల పూర్తికాల ఎంబీఏ కోర్సును ఆరంభించామని తెలిపారు. ఔత్సాహికులు గీతం వెబ్‌సైట్ (https://apply.gitam.edu) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు, ఆర్థిక సాయం అవసరం ఉన్నవారికి ఉపకారవేతనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అర్హత, ప్రవేశ వివరాలు, స్కాలర్‌షిప్‌ల గురించి మల్లేశ్వర రావు 99488 77755ను సంప్రదించాలని సూచించారు.

నేడు స్పాట్ అడ్మిషన్లు

సిర్గాపూర్, జూలై 31: సిర్గాపూర్‌లోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో గురువారం స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని స్థానిక ప్రిన్సిపాల్ శైలజ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 8వ తరగతిలో 10, టెన్త్‌లో 11 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో 3 సీట్లు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. విద్యార్థులు బోనాఫైడ్, టీసీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో ఆగస్టు 1వ తేదీన ఉదయం 9 గంటలకు సిర్గాపూర్‌లోని ఎస్టీ గురుకులంలో సకాలంలో హాజరు కావాలని సూచించారు.

బాచేపల్లి మినీ గురుకులంలో..

కల్హేర్, జూలై 31: బాచేపల్లిలోని ఎస్టీ మినీ బాలికల గురుకుల పాఠశాలలో 1వ, 5వ తరగతుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని, అసక్తి గల విద్యార్థులు ప్రవేశం పొందవచ్చని పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం నిర్మల తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1వ తరగతిలో 4 సీట్లు, 5వ తరగతిలో 11 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హత కలిగిన విద్యార్థినులు ఈ నెల 3వ తేదీన పాఠశాలకు వచ్చి ప్రవేశం పొందవచ్చన్నారు. వివరాలకు 99597 92022 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జిన్నారం, జూలై 31: గుమ్మడిదల మండలంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం గుమ్మడిదల, జిన్నారం మండలాల్లో కరెంటు సరఫరా ఉండదని ఏడీఈ శ్రీకాంత్ బుధవారం ప్రకటనలో తెలిపారు. గుమ్మడిదల మండల పరిధిలోని దుండిగల్ ఎయిర్ ఫోర్స్, అన్నారం, ప్రకృతి నివాస్, బొంతపల్లి, 11కేవీ ఆగ్రో బెల్ ఫీడర్‌పై ఉన్న పరిశ్రమలకు, జిన్నారం మండలంలోని గడ్డపోతారం సబ్‌స్టేషన్-1, సబ్‌స్టేషన్-2, ఖాజీపల్లి, అల్లీనగర్, చెట్టపోతారం, వావిలాల, లక్ష్మీపతిగూడెం, శివనగర్, రాళ్లకత్వ గ్రామాల పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కరెంటు సరఫరా ఉండదని జిన్నారం ఏఈ రాజు, బొంతపల్లి ఏఈ రవీందర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, పరిశ్రమల యాజమాన్యాలు సహకరించాలని కోరారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

కల్హేర్, జూలై 31: హైదరాబాద్ అకోలా 161 నంబర్ జాతీయ రహదారిపై బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్ మండలంలోని రాంరెడ్డిపేట్ గ్రామానికి చెందిన గూల రమేశ్(21) మంగళవారం రాత్రి నిజాంపేట్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా నిజాంపేట్ బాచేపల్లి గ్రామాల మధ్య ఉన్న బంజారా దాబా వద్ద జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తలకు, ఎడమ చేయికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి అన్న రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మధ్యాహ్నం వండుతలేరు!

- ఇంటి నుంచే తెచ్చుకొని తింటున్న విద్యార్థులు
- నెల రోజులుగా వెంటాడుతున్న నీటి సమస్య
- ఉట్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో దుస్థితి

ఇంటి నుంచి తెచ్చుకొని తింటున్న విద్యార్థులు

నాగల్‌గిద్ద, జూలై 31: మండలంలోని ఉట్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో నీటి సౌకర్యం లేకపోవడంతో దాదాపు నెల రోజులుగా మధ్యాహ్న భోజనం వండడం లేదు. దీంతో విద్యార్థులు ఇంటి నుంచే అన్నం తెచ్చుకొని తింటున్నారు. పాఠశాలలో మొత్తం 35 మంది విద్యార్థులు చదువుతున్నారు. బడికి భగీరథ పైప్‌లైన్ కనెక్షన్ ఉన్నప్పటికీ నీటిని సరఫరా చేయడం లేదు. పాఠశాల గ్రామానికి దూరంగా ఉండడంతో మధ్యాహ్న భోజన కార్మికులు నీటిని మోసుకురావడం భారమైందని మధ్యాహ్న భోజనం వండటం లేదు. ఈ విషయమై పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోధ్యాయుడు శంకర్‌ను అడగగా సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నీటి కొరత సాకుతో నేల రోజులుగా భోజనం పెట్టడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

ఇంటి నుంచే తెచ్చుకుంటున్నాం

మధ్యాహ్న భోజనానికి నీళ్లు లేవని నెల రోజుల నుంచి వండుతలేరు. దీంతో ఇంటి నుంచే అన్నం తెచ్చుకొని తింటున్నాం. ఇంటికాడ మా అమ్మ స్కూల్‌లో భోజనం పెడ్తలేరా అని అడిగింది. నీళ్లు లేక వండుతలేరని చెప్పాను.

- కార్తీక్, 6వ తరగతి ప్రాథమికోన్నత పాఠశాల, ఉట్‌పల్లి

మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 31: జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణపై పోలీసు, ఆబ్కారీ శాఖతో 'నాషా ముక్త్ భారత్ పఖ్వారా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యువత మత్తుకు బానిస కాకుండా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం, గంజాయి సాగు, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలన్నారు. రైతులు ఎవరైనా గంజాయి సాగు చేసినా, అంతర్‌పంటగా వేసినా సంబంధిత రైతుల భూమిని జప్తు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో డ్రగ్స్ సంబంధిత సమాచారముంటే 87126 56777 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఎస్పీ రూపేశ్, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ రమేశ్, అదనపు కలెక్టర్ మాధురి, ఎక్సైజ్ కమిషనర్ నవీన్‌చంద్ర, డీఎంహెచ్‌ఓ డాక్టర్ గాయత్రీ దేవి, డీఈవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కలెక్టర్ వల్లూరు క్రాంతి

మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, పక్కన ఎస్పీ చెన్నూరు రేపేశ్

సీజనల్ వ్యాధులపై తస్మాత్ జాగ్రత్త

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 31: జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో పంచాయతీ రాజ్, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ అధికారులు, వైద్య శాఖ అధికారులతో సీజనల్ వ్యాధులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో టైఫాయిడ్ కేసులు నమోదు కావడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి శాంపిల్స్‌ను మిషన్ భగీరథకు పంపించాలన్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ గాయత్రీ, జెడ్పీ సీఈవో జానకీరామ్, జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగు, రవాణాపై ఉక్కుపాదం

జిన్నారం, జూలై 31: గంజాయి సాగు చేసినా, అక్రమంగా రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరో డీఎస్పీ పుష్పకుమార్ హెచ్చరించారు. గంజాయి అక్రమ రవాణాలో యాక్టివ్‌గా ఉన్న, గంజాయికి అలవాటు పడిన నేరస్తులపై హిస్టరీ షీట్‌లను ఓపెన్ చేసినట్లు తెలిపారు. బుధవారం జిన్నారంలోని గిరిజన గురకుల బాలుర పాఠశాల, కళాశాలలో గంజాయిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని పోలీసులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా మాదక ద్రవ్యాల ఆనవాళ్లు ఉన్నట్లు గుర్తిస్తే ఎస్-నాబ్ 87126 56777 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు 'సే నో టు డ్రగ్స్' పోస్టర్లను కళాశాలకు అందజేశారు. కార్యక్రమంలో సీఐ సుదీర్‌కుమార్, టీ-నాబ్ సీఐ రాము, గురుకుల ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, వెంకటయ్య పాల్గొన్నారు.

పోస్టర్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు, టీ-నాబ్ డీఎస్పీ పుష్పకుమార్, తదితరులు

అంటరానితనాన్ని రూపుమాపాలి

కంది, జూలై 31: సమాజంలో అంటరానితనాన్ని రూపుమాపాలని కంది డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్ అన్నారు. పౌరహక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే) సందర్భంగా బుధవారం కంది మండల పరిధిలోని ఎర్రనూర్, ఇంద్రకరణ్ గ్రామాల్లోని ఎస్సీ కాలనీల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ప్రతి పౌరుడు అంటరానితనాన్ని నిర్మూలించేందుకు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా పౌరహక్కులకు భగం కలిగితే కఠిన చర్యలు తీసుకుంటామని, వివక్ష లేకుండా ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలన్నారు. ఎంపీఓ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్హేర్‌లో..

కల్హేర్, జూలై 31: హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి, ఆలయ ప్రవేశం చేయకుండా అంటరానితనం చూపుతున్నారా? అంటూ ఎస్సీ కాలనీవాసులను పోలీస్, రెవెన్యూ అధికారులు ప్రశ్నించారు. బుధవారం పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా కల్హేర్‌లోని ఎస్సీ కాలనీకి వెళ్లి పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా దూరం పెట్టడం, బెదిరించడం వంటివి చేస్తే పోలీస్‌లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ అంజయ్య, ఎంఆర్ఐ మల్లేషం పాల్గొన్నారు.

కల్హేర్: ఎస్సీ కాలనీలో అంటరాని తనంపై వివరాలు సేకరిస్తున్న అధికారులు

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన

కోహీర్, జూలై 31: మండలంలోని వెంకటాపూర్ గ్రామంతోపాటు జహీరాబాద్ మండలంలోని అల్గోల్ గ్రామంలో బుధవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కల్పించారు. మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయా గ్రామాల ప్రజలతో పోలీసులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దళితులను చిన్న చూపు చూడొద్దని సూచించారు. సమావేశంలో కోహీర్ ఎస్సై అరుణ్‌కుమార్, జహీరాబాద్ ఏఎస్సై సాజీద్, ఆర్ఐ రుక్మొద్దీన్, వార్డెన్ కృష్ణవంశీ, మాజీ సర్పంచ్‌లు మల్లికార్జున్, జ్యోతి, ప్రభాకర్ రెడ్డి, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగంలో ఎదుగుదల లేదని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

పటాన్‌చెరు, జూలై 31: చేస్తున్న ఉద్యోగంలో ఎదుగుదల లేదని మనస్తాపం చెందిన ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డి వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం బర్దిపూర్ గ్రామానికి చెందిన మేకల విక్రం (23) హైదరాబాద్‌లోని ఆర్డీసీ ఎక్స్‌రోడ్‌లో స్నేహితులతో కలసి ఉంటూ మోస్ట్రిఫ్ టెక్నాలజీ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. రెండేండ్లుగా సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నా కెరీర్‌లో ఎదుగుదల లేదని బాధపడేవాడు. పూర్తిగా నిరాశలో కూరుకుపోయిన విక్రం ఆత్మహత్య చేసుకునేందుకు నిర్ణయించుకుని మంగళవారం మధ్యాహ్నం రాయదుర్గంలోని కంపెనీ నుంచి పని ఉందని మధ్యలోనే బయటకు వచ్చాడు. స్నేహితులకు ఇస్నాపూర్‌లో బాబాయి ఉన్నాడని, అతడి వద్దకు వెళ్తున్నానని చెప్పాడు. ఆ తరువాత సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామ శివారులో జాతీయ రహదారి 65, ఓఆర్ఆర్ వెనుక ఉన్న చెట్టుకు ప్లాస్టిక్ వైర్‌తో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తండ్రి మేకల దుర్గయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'ఎన్నికల హామీలు మరిచిన కాంగ్రెస్'

కొండాపూర్, జూలై 31: కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు 620 హామీలు ఇచ్చిందని, అధికారం వచ్చాక హామీలు మరిచిపోయిందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాజుగౌడ్ ఎద్దేవా చేశారు. బుధవారం బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఎల్లయ్య, సీనియర్ నాయకులు గొల్ల మల్లేశం, వేమారెడ్డి, మల్కాపూర్ మాజీ సర్పంచ్ గొల్ల సత్తమ్మ, ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటేశం, మల్లేశం, రాజుగౌడ్, బీజేవైఎం నాయకుడు నరేన్ దేశ్‌పాండే పాల్గొన్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సత్యనారాయణ

సంగారెడ్డి, జూలై 31: జిల్లా కోర్టులో ఎస్సీ, ఎస్టీల తరపున వాదించేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మోకిల సత్యనారాయణ, అసిస్టెంట్ సెషన్స్ కోర్టు గ్రేడ్-2 పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నిర్మల బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ చెన్నూరి రూపేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఉన్నారు.

'అపక్ ఫైనాన్స్‌పై చర్యలు తీసుకోవాలి'

సంగారెడ్డి, జూలై 31: వడ్డీ వ్యాపారం చేస్తూ పేదలను మోసం చేస్తున్న అపక్ ఫైనాన్స్ ఆగడాలను అరికట్టి, వేధింపులకు గురిచేస్తున్న ఫైనాన్స్‌పై కఠిన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని సీపీఎం సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాణిక్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో కొండాపూర్ మండలం అనంతసాగర గ్రామానికి చెందిన బాధితుడు తుడుం రాజు తన గోడు వెల్లబోసుకున్నాడు. ఈ సందర్భంగా మాణిక్ మాట్లాడుతూ అపక్ ఫైనాన్స్‌లో అప్పు తీసుకొని కుటుంబ సభ్యుల అనారోగ్యం కారణంగా వాయిదాల చెల్లింపులో జాప్యం జరిగితే ఇంటికి వస్తాం.. తాళం వేస్తాం అని బెదిరిస్తున్నారని బాధితుడు వాపోయాడన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి యాదగిరి, నాయకులు అశోక్, అనిల్, సుభాష్, సాయికుమార్, బుచ్చయ్య ఉన్నారు.

ఉద్యోగులకు విరమణ తప్పదు

రామచంద్రాపురం, జూలై 31: ఉద్యోగులకు విరమణ తప్పదని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి అన్నారు. మున్సిపాలిటీలో మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న యాదగిరిరెడ్డి ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయనను కమిషనర్, వైస్‌చైర్మన్ రాములుగౌడ్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. కౌన్సిలర్లు బాబ్జీ, నాగరాజు, శ్రీశైలం, శ్రీకాంత్‌రెడ్డి, ఉమేశ్, ఏఈ మౌనిక పాల్గొన్నారు.

మేనేజర్ యాదగిరిరెడ్డిని సన్మానిస్తున్న కమిషనర్ సంగారెడ్డి, వైస్‌చైర్మన్ రాములుగౌడ్, కౌన్సిలర్లు

జిల్లాలో నేటి నుంచి పోలీస్ యాక్ట్ అమలు

సంగారెడ్డి, జూలై 31: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా నెల రోజుల పాటు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని, పోలీసుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్పీ చెన్నూరి రూపేశ్ బుధవారం ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు 30, 30(ఎ) పోలీస్ చట్టం 1861 ఆగస్టు 1వ తేదీ నుంచి 31 వరకు అమలులో ఉంటుందని తెలిపారు. జిల్లా పరిధిలో పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, మైకు పెట్టుకొని తిరగడం, సభలు, సమావేశాలు, నిరాహార దీక్షలు వంటివి నిర్వహించరాదని కోరారు.

మత్తుకు బానిస కావొద్దు

సంగారెడ్డి, జూలై 31: యువత మత్తుకు బానిసై జీవితాలను అంధకారంలోకి నెట్టుకుంటున్నారని ఎస్పీ చెన్నూరి రూపేశ్ అన్నారు. గంజాయి, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. బుధవారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో డీవైఎఫ్ఐ ముద్రించిన డ్రగ్స్ రహిత కరపత్రాలను ఆవిష్కరించారు. యువత మత్తుకు బానిసై జీవితాలను పాడు చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు అతిమేల మాణిక్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అశోక్, నాయకులు బుచ్చయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

కోహీర్, జూలై 31: కోహీర్ పట్టణంలోని డీసీసీబీ ఎదుట ఆర్‌అండ్‌బీ అధికారులు బుధవారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన వాహనదారులు సంబంధిత అధికారులు సీసీ రోడ్డు పనులను ప్రారంభించడం సంతోషకరమన్నారు.

రైతన్నకు భరోసాగా గ్రామీణ బ్యాంకులు

రాయికోడ్, జూలై 31: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు మారుముల గ్రామాల్లో అన్ని వసతులు కల్పిస్తామని సంగారెడ్డి జిల్లా గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ సమంత అన్నారు. బుధవారం మండల పరిధిలోని సింగితం గ్రామీణ బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన కార్యాక్రమంలో ఎస్‌బీఐ బీమా చెక్కులను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. బంగారంపై, మహిళా సంఘాలకు, స్వయం సహాయక సంఘాలకు, రైతులకు, క్రాప్‌లోన్లన అతి తక్కువ వడ్డీకే ఇస్తున్నామన్నారు. మండలంలోని తుమన్‌పల్లి గ్రామానికి చెందిన ఖామర్ ఇటీవల ప్రమాదంలో మరణించగా ఆయన తండ్రి షేబిర్‌సాబ్‌కు రూ.20 లక్షల బీమా చెక్కును అందించినట్లు తెలిపారు. సమావేశంలో సిబ్బంది హరీశ్, సతీశ్‌కుమార్, సిద్ధార్థ ఉన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

తహసీల్దార్‌ను సన్మానిస్తున్న అధికారులు

ఝరాసంగం, జూలై 31: జహీరాబాద్‌లోని ఎస్‌వీ కన్వెక్షన్ హాల్‌లో బుధవారం తహసీల్దార్ సంజీవరావు ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆర్డీవో రాజు హాజరయ్యారు. వారి దంపతులను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. నిమ్జ్ ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, మాజీ ఎంపీపీ దేవదాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హన్మంతరావు పటేల్, తహసీల్దార్లు హసీనబేగం, రవీందర్, నాయబ్ తహసీల్దార్లు యాసిన్, రాజిరెడ్డి, ఎస్ఐ నరేశ్, ఆర్ఐ రామారావు ఉన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

మాణయ్య దంపతులను సన్మానిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

జిన్నారం, జూలై 31: మండలంలోని చెట్లపోతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న మాణయ్య బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాణయ్య దంపతులను ఎంఈవో జెమిని, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ నాయకులు సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

అమరుడు ఇషాన్‌రెడ్డికి ఘన నివాళి

న్యాల్‌కల్, జూలై 31: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో బలిదానం చేసుకొని అమరుడైన ఇషాన్‌రెడ్డికి బీఆర్ఎస్ నాయకులు బుధవారం ఘన నివాళులర్పించారు. మండలంలోని మల్గి గ్రామంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఇషాన్‌రెడ్డి 14వ వర్ధంతిని పురస్కరించుకొని గ్రామ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మారుతీయాదవ్ మాట్లాడుతూ ఇషాన్‌రెడ్డితోపాటు ఎందరో అమరుల త్యాగ ఫలం, ఉద్యమ నాయకుడు కేసీఆర్ పోరాటంతోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు సిధారెడ్డి, శ్రీపతి, మాణిక్, సాగర్, నరేశ్, సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

మల్గిలో ఇషాన్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

షూరిటీగా కల్తీ బంగారం పెట్టి..

రూ.4 లక్షలు కాజేసిన దంపతులు

అమీన్‌పూర్, జూలై 31: కల్తీ బంగారం పెట్టి రూ.4 లక్షలు తీసుకొని ఉడాయించిన ఘటన అమీన్‌పూర్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కిష్టారెడ్డిపేటకు చెందిన రాజరాజేశ్వరి రెండు నెలలుగా బీరంగూడలోని భ్రమరాంబిక కాలనీలో కిరాణాషాప్ పెట్టుకొని జీవిస్తున్నది. అప్పుడప్పుడు కిరాణా సామాన్లు తీసుకోవడానికి వస్తున్న రమణమ్మ, ఆమె భర్త ఇద్దరు జూలై 7న వచ్చి తన కూతురు వివాహానికి డబ్బు అవసరం ఉందని, కొంత డబ్బు కావాలని అడిగారు. అందుకు షూరిటీగా గోల్కొండ కేబుల్ లైన్ తవ్వకాల్లో దొరికిన ఒక బంగారం బిస్కెట్‌ను ఇచ్చి రూ.8 లక్షలు కావాలని అడిగారు. అందుకు తన వద్ద అంత డబ్బు లేదని, రూ.4 లక్షలు ఇచ్చి ఆ బంగారు బిస్కెట్‌ను ఆమె వద్ద పెట్టుకుంది. ఐదు రోజుల తర్వాత పెండ్లి అయిపోయిందా అని తెలుసుకొనేందుకు రమణమ్మకు ఫోన్ చేయగా ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. అనుమానం వచ్చి ఆ బిస్కెట్‌ను బంగారం షాపులో చెక్ చేయించగా అది నకిలీ అని తెలిసింది. దీంతో రమణమ్మ, ఆమె భర్త నిజమైన బంగారం అని నమ్మించి రూ.4 లక్షలు కాజేసి మోసం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అమీన్‌పూర్ ఎస్ఐ సోమేశ్వరి తెలిపారు.